వీరుడి వీడ్కోలు

19 ఏండ్ల ఫుట్‌బాల్ కెరీర్‌కు ఛెత్రి గుడ్‌బై

భారత్‌కు ఆఖరి మ్యాచ్ ఆడేసిన దిగ్గజం

కువైట్‌తో వరల్డ్‌కప్ అర్హత పోరు డ్రా

సునీల్ ఛెత్రి కెరీర్

మ్యాచ్‌లు 151

గోల్స్ 94

> మ్యాచ్ చూసేందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నా గుండెలోతుల్లో నుంచి మాట్లాడుతున్నాను. ఇన్నాళ్లు నన్ను ఆదరించిన అభిమానులకు ధన్యవాదాలు. – **సునీల్ ఛెత్రి**

కోల్‌కతా: సుదీర్ఘ భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. కండ్లు చెదిరే ఆటతీరుతో కోట్లాది అభిమాన గణాన్ని సొంతం చేసుకున్న దిగ్గజ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి ఆటకు వీడ్కోలు పలికాడు. తన 19 ఏండ్ల ఫుట్‌బాల్ కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెడుతూ చెమర్చిన కండ్లతో మైదానాన్ని వీడాడు. గురువారం చారిత్రక సాల్ట్‌లేక్ స్టేడియం వేదికగా కువైట్‌తో జరిగిన వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో సునీల్ బరిలోకి దిగాడు. విజయంతో తన అసమాన కెరీర్‌కు అద్భుతమైన ముగింపు పలుకుతాడనుకున్న ఛెత్రికి.. కువైట్‌తో పోరు 0-0తో డ్రా కావడం ఒకింత నిరాశ కల్గించింది. తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో బ్లూ టైగర్స్ అవకాశాలను అందిపుచ్చుకోలేకపోయారు. మ్యాచ్ జరుగుతున్న సేపు స్టేడియంలో ఉన్న 68,000 మంది ప్రేక్షకులు సునీల్..సునీల్..వందేమాతరం అంటూ దిక్కులు పిక్కటిల్లేలా స్లోగన్‌లు చేశారు. గత పోరులో కువైట్‌పై 1-0తో విజయం సాధించిన టీమ్‌ఇండియా..అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయింది. 2005లో పాకిస్థాన్‌పై సునీల్ ఛెత్రి అరంగేట్రం మ్యాచ్ 1-1 డ్రా కాగా, ఆఖరి పోరు అదే విధంగా ముగియడం విశేషం.

స్వియాటెక్ X పలోని

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు అమీతుమీ • సెమీస్‌లో ఓడిన గాఫ్, ఆండ్రీవా

పారిస్: ఎర్రమట్టికోర్టు మహారాణి ఇగా స్వియాటెక్ (పోలండ్) ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. గురువారం ఫిలిప్పి చాట్రియర్ వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీ ఫైనల్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ 6-2, 6-4తో కోకో గాఫ్ (అమెరికా)ను వరుస సెట్లలో ఓడించి ఫ్రెంచ్ ఓపెన్‌లో నాలుగోసారి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. గత ఐదేండ్లలో స్వియాటెక్‌కు ఇది నాలుగో ఫైనల్ కావడం గమనార్హం. రెండో సెమీస్‌లో ఇటలీ యువ సంచలనం జాస్మిన్ పలోని 6-3, 6-1తో అన్‌సీడెడ్ రష్యా అమ్మాయి మిర్రా ఆండ్రీవాను చిత్తుచేసి స్వియాటెక్‌తో అమీతుమీకి సిద్ధమైంది. ఈ ఇద్దరి మధ్య శనివారం ఫైనల్ పోరు జరుగనుంది. ఇక పురుషుల డబుల్స్ సెమీస్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 5-7, 6-2, 2-6తో సిమోన్ బొలెల్లి-వవస్సూరి (ఇటలీ) చేతిలో ఓడి నిష్క్రమించింది.

హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు

హనుమకొండ చౌరస్తా: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ ఎస్)లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో 10వ తెలంగాణ స్టేట్ టోర్నీ పోటీలు నిర్వహిస్తున్నారు. బాలుర, బాలికల అండర్-8 నుంచి అండర్-20 వరకు వేర్వేరు విభాగాల్లో 1200 మంది ప్లేయర్లు పోటీ పడుతున్నారు. తొలిరోజు గురువారం 100మీ, 400మీ, హైజంప్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించారు. సింథటిక్ ట్రాక్‌పై ప్లేయర్లు చిరుతలను తలపిస్తూ పరిగెత్తారు. ఈ టోర్నీకి పారా ప్రపంచకప్ పసిడి విజేత జివాంజీ దీప్తి, నందిని, సాయిసంగీత ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హమనుకొండ అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు చంద్రమౌళిగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వార్టర్స్‌కు లక్ష్యసేన్

జకార్తా: భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-9, 21-15తో కెంటా నిషిమొటో(జపాన్)ను వరుస సెట్లలో ఓడించాడు. ఈ టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత్ తరపున మిగిలింది అతడొక్కడే. మరో పోరులో రజావత్ 10-21, 17-21తో కున్లావుత్ వితిద్సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమిపాలై నిష్క్రమించాడు. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప 21-13, 19-21, 21-13తో హ నా బేక్-సా హి లీ (దక్షిణ కొరియా) పై ఓడగా గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ.. 21-19, 19-21, 19-21తో మయు మట్సుమొటొ-వకన (జపాన్) ద్వయం చేతిలో పరాభవం పాలయ్యారు.

ఆసీస్ శుభారంభం

ఒమన్‌పై ఘన విజయం • స్టోయినిస్ ఆల్‌రౌండ్ షో

బార్బడోస్: ఆల్‌రౌండర్ మార్కస్ స్టోయినిస్ ఆల్‌రౌండ్ షోతో పొట్టి ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. గ్రూప్-బీలో భాగంగా బార్బడోస్ వేదికగా ఒమన్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' స్టోయినిస్(36 బంతుల్లో 67 నాటౌట్, 2 ఫోర్లు, 6 సిక్సర్లు) బ్యాట్‌తో పాటు బంతి (3/19) తోనూ రాణించడంతో కంగారూలు 39 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. స్టోయినిస్, డేవిడ్ వార్నర్ (51 బంతుల్లో 56, 6 ఫోర్లు, 1 సిక్సర్) అర్ధ సెంచరీలతో కదం తొక్కడంతో ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన ఒమన్.. 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 125 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టులో అయాన్ ఖాన్ (30 బంతుల్లో 36, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడాడు.

ఆదుకున్న వార్నర్, స్టోయినిస్:

ప్రమాదకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ (12) వికెట్‌ను ఆసీస్ మూడో ఓవర్లోనే కోల్పోయింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (14) విఫలమవగా హిట్టర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ డకౌట్ అయ్యాడు. 50 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను వార్నర్, స్టోయినిస్ ఆదుకున్నారు. ఒమన్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో మధ్య ఓవర్లలో ఆసీస్ వేగంగా పరుగులు చేయలేకపోయింది. ఓపెనర్‌గా దిగి 17 ఓవర్ల పాటు క్రీజులో ఉన్నా వార్నర్ దూకుడుగా ఆడలేకపోయాడు. కానీ మెహ్రాన్ ఖాన్ 15వ ఓవర్లో స్టోయినిస్ 4 భారీ సిక్సర్లతో ఆసీస్ స్కోరు వేగం పెరిగింది. మరుసటి ఓవర్లో సిక్సర్‌తో అతడు అర్ధ శతకాన్ని పూర్తిచేయగా షకీల్ 18వ ఓవర్లో సిక్స్‌తో వార్నర్ కూడా అర్ధసెంచరీ మార్క్ అందుకుని ఆసీస్‌కు గౌరవప్రదమైన స్కోరును అందించారు.

ఒమన్ పోరాడినా..:

ఛేదనలో ఒమన్ టాపార్డర్ విఫలమైంది. స్టార్క్ (2/20), ఎల్లిస్ (2/28), స్టోయినిస్ ధాటికి ఒమన్ కుదేలైంది. టాప్ -5 బ్యాటర్లలో కెప్టెన్ అఖిబ్ (18) ఒక్కడే కాస్త ప్రతిఘటించాడు. 57 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఒమన్‌ను అయాన్, మెహ్రాన్ ఖాన్ (27) ఆదుకోవడంతో ఆ జట్టు అవమానకర ఓటమిని తప్పించుకుంది. స్పిన్నర్ ఆడమ్ జంపా (2/24) ఒమన్‌ను కట్టడి చేశాడు.

స్టోయినిస్ (67 నాటౌట్, 3/19)

సంక్షిప్త స్కోర్లు:

ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 164/5 (స్టోయినిస్ 67 నాటౌట్, వార్నర్ 56, మెహ్రాన్ ఖాన్ 2/38, కలీముల్లా 1/30). **ఒమన్:** 20 ఓవర్లలో 125/9 (అయాన్ ఖాన్ 36, మెహ్రాన్ ఖాన్ 27, స్టోయినిస్ 3/19, స్టార్క్ 2/20)

అమెరికా అదుర్స్

సూపర్ ఓవర్‌లో పాక్‌పై అద్భుత విజయం

టీ20 ప్రపంచకప్ టోర్నీ

మోనాక్ (50)

డల్లాస్: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య అమెరికా అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. టైటిల్ ఫెవరేట్లలో ఒకటైన పాకిస్థాన్‌పై అమెరికా సంచలన విజయంతో కదంతొక్కింది. గురువారం ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరు(సూపర్ ఓవర్)లో యూఎస్ఏ చారిత్రక విజయం సాధించింది. మహమ్మద్ ఆమిర్ వేసిన సూపర్ ఓవర్‌లో అమెరికా ఒక వికెట్ కోల్పోయి 18 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాక్ వికెట్ కోల్పోయి 13 పరుగులకు పరిమితమైంది. టీ20ల్లో పాకిస్థాన్‌పై యూఎస్ఏకు ఇది తొలి విజయం కావడం విశేషం. అంతకుముందు టాస్ కోల్పోయిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో సారథి బాబర్ ఆజమ్ (44), షాదాబ్ ఖాన్ (40) ఫర్వాలేదనిపించగా ఆఖర్లో షహీన్ షా అఫ్రిది (23 నాటౌట్) మెరుపులతో పాక్ ఆ మాత్రం స్కోరైనా చేసింది. రిజ్వాన్(9), ఉస్మాన్‌ఖాన్(3) ఫకర్ జమాన్(11), అజమ్‌ఖాన్(0) ఘోరంగా విఫలమయ్యారు. అమెరికా బౌలర్లు సమిష్టిగా రాణించి బాబర్ సేనను కట్టడి చేశారు. నొస్తుష్ కెంజిగె (3/30), నేత్రవల్కర్ (2/18) అద్భుత బౌలింగ్‌తో పటిష్టమైన పాక్ బ్యాటింగ్ ఆర్డర్ విఫలమైంది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన అమెరికా 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సరిగ్గా 159 పరుగులు చేసింది. ఓపెనర్ మెనాక్ పటేల్(50), అరోన్ జోన్స్(36 నాటౌట్), అండ్రిస్ గౌస్(35) రాణించారు. అమిర్, నసీమ్‌షా, రవూఫ్ ఒక్కో వికెట్ తీశారు. మోనాక్ పటేల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు:

పాకిస్థాన్: 20 ఓవర్లలో 159/7 (బాబర్ 44, షాదాబ్ 40, కెంజిగె 3/30, నేత్రవల్కర్ 2/18). **అమెరికా:** 20 ఓవర్లలో 159/3 (మోనాక్ పటేల్ 50, జోన్స్ 36 నాటౌట్, అమిర్ 1/25, నసీమ్ 1/26)

సూపర్ ఓవర్ స్కోర్లు	అమెరికా: 18/1
	పాకిస్థాన్: 13/1

సుబుగ (4-2-4-2)

ఉగాండా సంచలనం

పపువా న్యూగినీపై ఉత్కంఠ విజయం .. సుబుగ డ్రీమ్ స్పెల్

గయానా: తొలిసారిగా 20 జట్లతో ఆడుతున్న టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా.. ఆఫ్రికా క్వాలిఫయర్స్‌లో రాణించి అన్నింటి కంటే చివరగా అర్హత సాధించిన ఉగాండా.. ఈ మెగా టోర్నీలో సంచలనం సృష్టించింది. మొదటి సారి పొట్టి ప్రపంచకప్ ఆడుతున్న ఆ జట్టు.. గురువారం గయానా వేదికగా పపువా న్యూగినీ (పీఎన్జీ)తో జరిగిన మ్యాచ్‌లో గెలిచి చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. 43 ఏండ్ల ఆఫ్ స్పిన్నర్ ఫ్రాంక్ సుబుగ.. (4-2-4-2) సంచలన స్పెల్‌తో పాటు భారత సంతతి ఆటగాడు అల్పేశ్ రంజానీ (2/17), జుమ మియాగి (2/10) బంతితో మాయ చేయడంతో తొలుత బ్యాటింగ్ చేసిన పీఎన్జీ 19.1 ఓవర్లలో 77 పరుగులకే ఆలౌట్ అయింది. హిరి హిరి (15) టాప్ స్కోరర్. లక్ష్య ఛేదనలో ఉగాండా సైతం తడబడింది. 6 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయినా.. సహచరుల అండతో ఆ జట్టు మిడిలార్డర్ బ్యాటర్, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' రియాజత్ అలీ షా (56 బంతుల్లో 33, 1 ఫోర్) పోరాటానికి తోడు మియాగి (13) రాణించి ఉగాండాకు చారిత్రక విజయాన్ని అందించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.